జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 29-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 576 పేజీలు: 4 వెల : రూ.7

## ఆంజనేయ స్వామి ఆలయ మండపం.. పునర్నిర్మాణం

## జాతీయ వార్తకు స్పందన





* ‘జాతీయ వార్త’ కథనానికి స్పందించిన హిందూ ధార్మిక సంస్థలు, అధికారులు
* గంటల వ్యవధిలోనే మండపాన్ని పున:నిర్మించిన వైనం
* ‘జాతీయ వార్త’కు రుణపడి ఉంటాం: వెంకటాపురం గ్రామపెద్దలు
* ధర్మాన్ని రక్షించడంలో ‘జాతీయ వార్త’ పాత్ర అభినందనీయం: హిందూ పరిరక్షణ సమితి


జాతీయ వార్త తెలుగు దిన పత్రిక
www.jatheeyavaartha.com
28 Jan 2026 - Page 2

వెంకటాపురంలో ఆంజనేయ ఆలయ మండపం కూల్చివేత

-అడ్డుకున్న వారిపై దాడి
- రాజకీయ కక్షతోనే
ఈ అరాచకమంటున్న గ్రామస్థులు

కొత్తూరు, జనవరి28 (వార్త): కొత్తూరు మండలంలోని వెంకటాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయ మండపం కూల్చివేతపై ‘జాతీయ వార్త’లో ప్రచురితమైన కథనం అధికార యంత్రాంగంలోనూ, హిందూ ధార్మిక సంస్థల్లోనూ భారీ కదలిక తీసుకువచ్చింది. అందరినోట చర్చనీయాంశమైంది. పార్వతీపురం మన్యం జిల్లా బీజేపీ అధ్యక్షుడు కె.తిరుపతిరావు, శ్రీకాకుళం జిల్లా బీజేపీ కార్యదర్శి దమయంతి, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కె.రాజారావు, భజరంగ్ దళ్ సభ్యులు పెద్ద ఎత్తున ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం రంగంలోకి దిగారు. కూల్చివేతకు గురైన మండప స్థానంలో తిరిగి పునఃనిర్మాణం చేపట్టారు. బుధవారం సాయంత్రం కల్లా ఆలయ మండపాన్ని యధాస్థితికి తీసుకువచ్చి, భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడం గమనార్హం. ఆలయ మండపం తిరిగి నిర్మితం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. “కూల్చివేత ఉదంతాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన ‘జాతీయ వార్త’ పత్రికకు మేము రుణపడి ఉంటాం” అని గ్రామ పెద్దలు కొనియాడారు. ధర్మాన్ని రక్షించే క్రమంలో పత్రిక పోషించిన పాత్ర అభినందనీయమని హిందూ పరిరక్షణ సమితి సభ్యులు పేర్కొన్నారు.

## హాస్టల్ అధికారికి.. ఏసీబీ ఝలక్

* ఏసీబీ దాడులతో ఏబిసిడబ్ల్యూఓ అవినీతి బట్టబయలు * 1,80,000 మామూళ్ల సొమ్ము రెడ్ హ్యాండెడ్‌గా స్వాధీనం * ఒక్కో విద్యార్థి నుంచి రూ.5లు వసూలు చేసిన బాలముకుందరావు



కంచిలి/సోంపేట, జనవరి 28 (వార్త): పలాస రెవెన్యూ డివిజన్లో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బాలముకుందరావు అవినీతి బాగోతాన్ని ఏసీబీ అధికారులు బట్టబయలు చేశారు. ఎన్నో ఏళ్ల తరబడి అవినీతిలో మునిగితేలుతున్న సదరు అధికారి పాపం పండింది. హాస్టల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల నుంచి నెలకు ఒక్కొక్కరి నుంచి ఐదు రూపాయలు చొప్పున వసూలు చేసి ప్రతి నెల లక్షల రూపాయలు బాలముకుందరావుకు అప్పగిస్తున్న వైనం ఏసీబీ దాడులతో వెలుగులోకి వచ్చింది. ఈ అవినీతి వ్యవహారానికి వేదికగా కంచిలి మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ నిలవడం గమనార్హం. సోంపేట కేంద్రంగా కార్యాలయంలో పనిచేయాల్సిన ఏబిసిడబ్ల్యుఓ బాలముకుందరావు అక్కడ కార్యాలయం లేకుండా ఎక్కడో ఉంటూ ప్రతి నెల వసూళ్లకు మాత్రం కంచిలిలో గల బీసీ బాయ్స్ హాస్టల్‌ను కేంద్రంగా ఎంచుకోవడం గమనార్హం.

ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ రమణమూర్తి ఆదేశాల మేరకు సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం సాయంత్రం మెరుపు దాడులు నిర్వహించారు. పలాస డివిజన్లో గల సోంపేట, బొడ్డపాడు, ఎర్రముక్కాం, ఇచ్ఛాపురం, కొలిగాం, ఎమ్మెస్ పల్లి, రాజపురం, పలాస, జి ఆర్ పురం బీసీ హాస్టళ్ల వార్డెన్లు కంచిలిలో సమావేశానికి హాజరై విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఒక లక్షా 84వేల రూపాయలు పైచిలుకు నగదు మొత్తాన్ని బాలముకుందరావుకు అప్పగించేందుకు తీసుకువచ్చారు. ఏసీబీ అధికారుల దాడుల్లో ఈ నగదు మొత్తాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వానికి అప్పగించనున్నట్లు సీఐ భాస్కరరావు తెలిపారు. అలాగే ఆయా వార్డెన్‌లను విచారణ జరిపారు. ఈ విచారణలో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతి హాస్టల్లో చదువుకుంటున్న వెనుకబడిన తరగతుల పేద విద్యార్థుల నుంచి నెలకు 5 రూపాయలు చొప్పున వసూలు చేసి పలాస డివిజన్లో గల వేలాదిమంది విద్యార్థుల నుంచి ప్రతి నెల లక్ష రూపాయలకు పైగా సదరు అధికారికి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ఏళ్ల తరబడి జరుగుతున్న ఈ అవినీతి తంతుకు ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులతో బాలముకుందరావుపై అవినీతి కేసు నమోదు చేస్తూ దీనికి చరమగీతం పాడారు. పేద విద్యార్థులకు అసలే సౌకర్యాల కొరత చాలీచాలని భోజనం మొదలైన సమస్యలతో చదువులు సాగిస్తున్న నేపథ్యంలో తిరిగి వాళ్ల నుంచే మామూళ్లు వసూలు చేసి ఈ అవినీతి అధికారికి చెల్లించుకోవడంతో పాటు హాస్టల్లో వార్డెన్‌ల నుంచి కూడా ప్రతి నెల కొంత మొత్తాన్ని బ్లాక్ మెయిల్ చేస్తూ రాబట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.



### అనుమానం రాకుండా కలెక్షన్లు..

ప్రతినెలా జరుగుతున్న ఈ అవినీతి దందాలో ఎవరికీ అనుమానం రాకుండా ప్రతినెల హాస్టల్ అధికారులు వసూలు చేసిన డబ్బును ప్రత్యేక పౌచ్‌లో పెట్టి బాలముకుందరావుకు అందజేయడం విశేషం. ఇంత ఘోరంగా వసూళ్లకు పాల్పడుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా నోరు విప్పకుండా ఉన్నతాధికారుల అవినీతికి వంత పాడడం గమనార్హం. పేద విద్యార్థుల ఉన్నతి కోసం వారి విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించేలా హాస్టల్‌ను తనిఖీ చేస్తూ లోపాలను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారి నిరంతరం అవినీతికి పాల్పడడం పట్ల ప్రతి ఒక్కరు ముక్కున వేలేసుకుంటున్నారు. బయట ప్రపంచానికి ఏమాత్రం తెలియకుండా లోపాయికారీగా హాస్టల్లో అధికారులను నానా సాకులతో బెదిరిస్తూ ఎలా వక్రమార్గంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అవినీతి అధికారి బాలముకుందరావు వ్యవహారం బయటపడడం పట్ల ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారు. బాలముకుందరావుతోపాటు విద్యార్థుల నుంచి వసూలు చేసి ప్రతినెలా డబ్బులు అప్పగిస్తున్న హాస్టల్లో అధికారులపై కూడా నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సీఐ భాస్కరరావు తెలిపారు.

## ఉపాధి నిధులకు.. పంగ నామాలు

* ఏపీవో నరసింహమూర్తి అక్రమాలు బట్టబయలు * ఉపాధి నిధులు స్వాహా చేసిన అక్రమార్కుడు * రూ.3,07,379 ఫీల్డ్ అసిస్టెంట్ భార్య ఖాతాలో జమ * ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న అక్రమాలు * నిలదీస్తున్న వేతనదారులు * మౌనం వహిస్తున్న సంబంధిత అధికారులు * వారిపై కూడా వెల్లువెత్తుతున్న అనుమానాలు

4లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## నిద్దాలమ్మా.. కాపాడమ్మా..!

**-మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

**జి.సిగడాం, జనవరి 28(వార్త):** నిద్దాంలో గల నిద్దాలమ్మ తల్లి మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తుంతా ముగ్రాటలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు, హోమాలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.



## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**మందస, జనవరి 28(వార్త):** ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి కోరారు. నరసింగపురం, కొంకడాపుట్టి సచివాలయాల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో జరిగాయి. రెండు సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో వ్యాధినిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు. పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, పశుబీమా గురించి, పశుగ్రాసాల సాగు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజు, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణితో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

## గుణవంతు మృతి దురదృష్టకరం



**పలాస, జనవరి 28 (వార్త):** బొడ్డపాడు గ్రామ అభివృద్ధికి అనుక్షణం పాటుపడే రాజాం గుణవంతును కోల్పోవడం బాధాకరమని ప్రముఖ సంఘ సేవకుడు, టీడీపీ నాయకులు, జై భీమ్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు కిక్కిర ఢిల్లీరావు అన్నారు. తాను ఒక ఆత్మీయ తండ్రి లాంటివాడిని కోల్పోయానన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ భగవంతుని కోరుతున్నానన్నారు. ఆయన మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపారు.

## గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**మందస, జనవరి 28(వార్త):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి తెలిపారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో 5, 6, 7, 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు http://apgpcet.apcfss.in అనే వెబ్‌సైట్‌లో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20నుంచి ఫిబ్రవరి 19వలోగా విద్యార్థినిలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704550012, 7993757334, 9703392919 అనే ఫోన్ నంబర్లుకు సంప్రదించాలని కోరారు.

## కొంకడాపుట్టిలో వివాద భూములకు హద్దులు



**మందస, జనవరి 28(వార్త):** కొంకడాపుట్టిలో కొన్ని భూములకు సంబంధించి వివాదాలు ఉన్నాయి. వీటిని పరిష్కరించమని బాధిత రైతులు పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేశారు. ఈ మేరకు జిల్లా సర్వేయర్ ఆధ్వర్యంలో కొంకడాపుట్టి గ్రామస్తులు, పెద్దలు ఆధ్వర్యంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కొంకడాపుట్టి వెళ్ళి, జిరాయితీ భూములు, హద్దులు గుర్తించారు. వీటికి సంబంధించి సరిహద్దులను ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిర్ణయించి, భూములను చూపించారు. కాగా, సక్రమంగా సర్వే చేసి నిజాయితీగా భూమిని అధికారులు అప్పగించారని, గిరిజన రైతులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పెద్దలు, జిల్లా మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సవర నారాయణరావు, జనసేన మండల ఉప అధ్యక్షుడు సవర శివ పరిష్కార దిశలో బాధితులుకు న్యాయం చేకూర్చేలా కృషి చేశారని వారిని అభినందించారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నరసింహారావు, ఉపాధ్యక్షుడు సవర హరికృష్ణ, సహఅధ్యక్షుడు సవర నారాయణరావు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేరు రమేష్ పాల్గొన్నారు.

## చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలపై అవగాహన



**పలాస, జనవరి 28 (వార్త):** పలాస రైల్వే స్టేషన్ ప్రాంగణంలో బుధవారం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు సమక్షంలో రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ బాల సరస్వతి .. ప్రయాణికులకుచ,, బాల బాలికలకు రక్షణ, సంరక్షణ అవసరమైన ఎడల టోల్ ఫ్రీ నెంబర్ 1098 ను సంప్రదించాలని కోరారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. బాల కార్మికుల గూర్చి, తప్పిపోయిన, పారిపోయిన పిల్లల గూర్చి, అక్రమ రవాణా, కిడ్నాప్ కు గురవుతున్న పిల్లలు తదితర అంశాలను వివరించారు.

## ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు.. పోలీసులకు ఫిర్యాదు

**వజ్రపుకొత్తూరు, జనవరి 28 (వార్త):** పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరిపై ఆధారరహితమైన, అనుచితమైన, పూర్తిగా అబద్ధాలతో కూడిన ఆరోపణలను ఒక న్యూస్ ఛానల్ ద్వారా ప్రచారం చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ, సంబంధిత మీడియా వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియాకు ఉన్న స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ, ఎలాంటి ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎమ్మెల్యే భర్త యార్లగడ్డ వెంకన్న చౌదరిపై తప్పుడు ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండనీయమని తెలిపారు. కావాలని రాజకీయ దురుద్దేశంతో ఇలాంటి వీడియోలు రూపొందించి ప్రసారం చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించి, శాసనసభ్యుల గౌరవం, ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవకులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం చట్టవిరుద్ధమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి బాధ్యతారాహిత్యమైన మీడియా వ్యవహారాల వల్ల సమాజంలో గందరగోళం నెలకొనే ప్రమాదం ఉందని, అందుకే సంబంధిత ఛానల్, ఆ వీడియోను రూపొందించిన వ్యక్తిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



# గ్రూప్-2 ఫలితాల్లో మెరిసిన నడిమివలస

**-ఒకేసారి ఇద్దరి గ్రామస్తుల ఎంపిక**

**-ఒకరిది తొలి ప్రయత్నం.. మరొకరిది మలి ప్రయత్నం**

**-ఉద్యోగాలు సాధించిన సొరోతు రాము, శ్రీనివాసరావు**

**-హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**జి.సిగడాం, జనవరి 28(వార్త):** ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల్లో నడిమివలస గ్రామానికి చెందిన సొరోతు రాము డిప్యూటీ తహసీల్దార్‌గా, సొరోతు శ్రీనివాసరావు ఏఎస్‌వోగా ఎంపికయ్యారు. తండ్రి మరణించినా తల్లి లక్ష్మి కాయకష్టం చేసి, రామును చదివించింది. రాము వరంగల్ నిట్ ఐఐటీ పూర్తి, అనంతరం ఫోర్డ్ కంపెనీలో ఓ ఏడాది పాటు ఉద్యోగం చేసి, సివిల్స్‌కు హైదరాబాద్‌లో సొంతంగా సన్నద్ధమయ్యారు. తొలి ప్రయత్నంలోనే డిప్యూటీ తహసీల్దార్‌గా విజయం సాధించాడు. రాము ఎంపికపై స్నేహితులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, ఆయనకు అభినందనలు తెలిపారు



**ఉపాధ్యాయునిగా పని చేస్తూ .. ఏఎస్‌వోగా**

సొరోతు శ్రీనివాసరావు 2010లో ఎస్‌జీటీగా ఉపాధ్యాయ వృత్తిలో చేరి, జి.సిగడాం, రేగిడి ఆమదాలవలస మండలాల్లో విధులు నిర్వహించారు. పట్టు వదలని విక్రమార్కుడిలా చదివి రెండో ప్రయత్నంలో ఏఎస్‌వోగా ఎంపికయ్యారు. అమరావతి సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారి(ఏఎస్‌వో)గా వెళ్లనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. తండ్రి ఆదినారాయణ వ్యవసాయం, తల్లి చిన్నమ్మి గృహిణి, భార్య మనీషా గృహిణి. శ్రీనివాసరావుకు తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు.



## రాష్ట్ర చరిత్రను తిరగరాసిన యువగళం

**-టీడీపీ పలాస నియోజకవర్గ అధికార ప్రతినిధి తలగాన నరసింహులు**



**పలాస, జనవరి 28(వార్త):** యువగళం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రను తిరగరాసిందని టిడిపి పలాస నియోజకవర్గ అధికార ప్రతినిధి తలగాన నరసింహులు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నాడు నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పలాస మండలం పెదంచల గ్రామంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి, యువత సమస్యలను, నిరుద్యోగ సమస్యలను, అన్నదాతల ఆవేదనను నేరుగా ప్రజల మధ్యకు తీసుకెళ్లిన ఉద్యమమే యువ గళమన్నారు. నాడు అధికారంలో ఉన్న ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై అడుగు అడుగున ప్రశ్నిస్తూ, అడ్డంకులు ఎదుర్కొంటూ, అవమానాలను భరిస్తూ నారా లోకేష్ చేపట్టిన యువగళశీ పాదయాత్ర స్మృతులను మననం చేసుకోవాలన్నారు. కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు నారా లోకేష్ పాదయాత్ర విజయవంతంగా జరిగిందన్నారు. ఆ పాదయాత్ర రాష్ట్రం నలు దిశలా 226 రోజులు, 3132 కిలోమీటర్ల మేర సాగిన నారా లోకేష్ యువ గళం పాదయాత్ర ప్రజా గళంగా మారి ప్రభంజనం సృష్టించిందని, దానితో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 175కు 164 స్థానాల్లోగా విజయం సాధించిందని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంను చేతల బట్టి, హక్కులను గుర్తు చేస్తూ, యువతలో చైతన్యాన్ని తీసుకువచ్చిన ఘనత నారా లోకేష్ కే చెల్లిందన్నారు. ఆ పాదయాత్ర 2024 ఎన్నికల్లో ప్రజల తీర్పుకు పునాది వేసిందని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో కీలక మంత్రిగా బాధ్యతలు చేపట్టి, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా నారా లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రానికి భవిష్యత్తు ఇస్తున్నాయని తెలిపారు. యువత ఆశలు, ప్రజలు నమ్మకమే బలంగా ముందుకు సాగుతున్న నారా లోకేష్ నాయకత్వంలో యువ గళం స్ఫూర్తి మరింత విస్తరించాలని, రాష్ట్రం మరింత ప్రగతి పథశీ లో వేగంగా దూసుకెళ్లాలని తలగాన నరసింహులు ఆకాంక్షించారు.

## క్రాంతిచైతన్యను తక్షణమే విడుదల చేయాలి

**-వామపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్**



**పలాస, జనవరి 28 (వార్త):** పౌర హక్కుల సంఘం నేత, అడ్వకేట్ క్రాంతి చైతన్యపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని, అరెస్టు చేసిన క్రాంతి చైతన్యను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్రిదానేష్ పిలుపునిచ్చారు. బుధవారం పలాస మండలం బొడ్డపాడులో పౌరహక్కుల సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పత్రి దానష్ అధ్యక్ష వహించారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ నూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల. మాధవరావు మాట్లాడుతూ నేడు దేశములో మత ఫాసిజం అమలవుతుందని దీని మూలంగా ప్రశ్నించే వాళ్ళపైన అక్రమ అరెస్టులు, నిర్బంధాలు పెరుగుతున్నాయని, దీని కొనసాగింపే పౌర హక్కుల నేత క్రాంతి చైతన్య అరెస్టు అని, ఈ అరెస్టు అక్రమమని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన దినికి చిహ్నమని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను పాలకులు ఉల్లంఘించడమే అని అన్నారు. సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల. మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు కారు చౌకుగా అప్పగించడానికి పాలకుల కుట్రలు చేస్తున్నారని, దీన్ని ప్రశ్నించడమే పౌర హక్కుల సంఘం చేసిన నేరమా? స్వాతంత్రానికి ముందు తరవాత కూడా మాట్లాడే వాళ్ళ పైన ప్రశ్నించే వాళ్ళపైన ఈ నిర్బంధం కొనసాగుతుందని, నియంతృత్వపు నల్ల చట్టాలను తీసుకువస్తూ ప్రజల పైన వాళ్ళ జీవితాల పైన బలవంతంగా రుద్దటం ఈ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళ పైన దేశద్రోహులు అని, ముద్ర వేసి అక్రమ కేసులు పెట్టడం నేరమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఎం నాయకులు కోనారి మోహన్ రావు మాట్లాడుతూ కార్మికులు రైతులు మహిళలుపై జరుగుతున్న దాడులను ప్రశ్నించటం, వాళ్ళ పక్షాన నిలబడి మాట్లాడే ప్రజాస్వామిక వాదుల పైన దేశద్రోహం లాంటి కేసులు పెట్టడం ఆ ప్రజాస్వామికమని, దీన్ని మేము ఖండిస్తున్నామని అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి. కుసుమ మాట్లాడుతూ అవినీతి అక్రమాలు దేశంలో ఉన్నంతవరకు ప్రశ్నించేవాళ్లు ఉంటారని, ప్రశ్నించే వాళ్ళపైన అక్రమ కేసులు పెట్టి నిర్బంధించటం అన్యాయమని, క్రాంతి చైతన్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్ మాట్లాడుతూ పౌర హక్కుల నేతలపై అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని, నేడు దేశంలో అన్ని రంగాలలో కాషాయీకరణ జరుగుతుందని, విద్యారంగంలో కూడా జరుగుతుందని, విద్యార్థుల పైన కూడా అక్రమ కేసులు పెడుతున్నారని, ఈ నియంతృత్వపు దాడులకు వ్యతిరేకంగా అన్ని శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల బాధ్యులు పీకేఎస్ పుచ్చ దుర్యోధన, పిడిఎం సాలిన.వీరాస్వామి ,ప్రజా కళామండలి కొర్రాయి. నీలకంఠలు మాట్లాడుతూ మాట పైన పాట పైన, మాట్లాడే వాళ్లను నిర్బంధించి అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని, పౌర హక్కుల నేత క్రాంతి చైతన్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజాస్వామ్యక వాదులు, వివిధ సంఘాల నాయకులు హాజరై పౌర హక్కుల నేత క్రాంతి చైతన్యను వెంటనే విడుదల చేయాలని హక్కుల కోసం మాట్లాడే వారి పైన అక్రమ కేసులు పెట్టడం సరికాదని ముక్తకంఠంతో ఖండించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ. సన్యాసిరావు, రాష్ట్ర నాయకులు మద్దిల. రామారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు జుత్తు.వీరాస్వామి, బాలకృష్ణ, అరుణోదయ నాయకులు రామారావు, అఖిలభారత రైతు కూలి సంఘ నాయకులు పాపయ్య, పలాస రైతు సంఘ నాయకులు మామిడి మాధవరావు, దాసరి శ్రీరాములు, మూఢనమ్మకాల వ్యతిరేక సంఘ సభ్యులు పిట్ట. గీతారాణి, ప్రజా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి

**-కొత్తూరు తహసీల్దార్‌కు చేనేత కార్మికుల వినతి**

**కొత్తూరు, జనవరి 28 (వార్త):** మెంథా తుఫాన్ ప్రభావంతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత రేషన్ సరఫరాలో బయోమెట్రిక్ సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించి, కార్మికులకు సరుకులు అందేలా చూడాలని కోరుతూ బుధవారం కొత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జోగారావుకు చేనేత కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొత్తూరు చేనేత సంఘం నాయకులు మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావిత చేనేత కార్మికుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించిందని తెలిపారు. అయితే, గత రెండు నెలలుగా బయోమెట్రిక్ పడటం లేదనే కారణంతో రేషన్ డీలర్లు సరుకులు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సాయం అందినప్పటికీ, సాంకేతిక కారణాలతో అది కార్మికులకు చేరకపోవడం దారుణమన్నారు. కార్మికులు ఇచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ జోగారావు సానుకూలంగా స్పందించారు. బయోమెట్రిక్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ఉచిత రేషన్ అందేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు చేనేత సంఘం కార్యదర్శి మరియు టీడీపీ నాయకులు ఆశపు గణేష్?తో పాటు చేనేత కార్మికులు ఆశపు భద్రయ్య, పుత్సల బసవరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఆర్జీఎస్‌ఏ శిక్షణ



**పలాస, జనవరి 28(వార్త):** పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఆర్జీఎస్‌ఏ శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆర్జీ ఎస్ఏ ట్రైనింగ్‌లో భాగంగా డిపిఆర్సి, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ ఉద్యోగులకు పలాస డివిజన్‌కి సంబంధించి మండల ప్రజా పరిషత్ పలాస కార్యాలయంలో ఎలక్ట్రానిక్ గవర్నెన్స్, ఈ గవర్నెన్స్, బిజిఆర్ఎస్ ఈ గవర్నమెంట్ సిరాజ్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వసంతకుమార్, పలాస డిప్యూటీ ఎంపీడీవో, పలాస డిపిఆర్‌సి రిసోర్స్, ఎంటిపి ఆనందరావు, యమ్ఓటీలు గోపీనాథ్, ఎస్వీ రమణారావు, రఘునందచారి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 89 మంది, పీడీఓలు పాల్గొన్నారు.

## బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా కృష్ణారావు



**మెళియాపుట్టి, జనవరి 28(వార్త):** బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా ఇప్పిలి కృష్ణారావు నియమితులయ్యారు. బుధవారం నాడు జాతీయ బీసీ సంఘం నాయకులు ఆయనను మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను మండలంలోని పలువురు బీసీ సంఘం నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తనను బీసీ సంఘ మండల అధ్యక్షుడిగా నియ మించినందుకు జాతీయ, రాష్ట్ర సంఘం నాయకులు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలి పారు. బీసీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీకి ‘పద్మావతి’ విద్యార్థిని మాధవి ఎంపిక



**నరసన్నపేట, జనవరి 28(వార్త):** నరసన్నపేటలోని పద్మావతి ప్రైవేట్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని సిహెచ్ సాయి కోమల్ మాధవి ప్రఖ్యాత అజీమ్ ప్రేమ్జీ యూనివర్సిటీలో బీఏ హానర్స్ డిగ్రీ కోర్సుకు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా డిసెంబరు నెలలో రాత పరీక్ష నిర్వహించగా, జనవరిలో జరిగిన ఇంటర్వ్యూ ఆధారంగా మాధవి ఎంపికైనట్లు ఆయన వివరించారు. ప్రతిభ, ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రదర్శనతో ఆమె ఈ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో స్థానం సంపాదించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మాధవి సాధన, క్రమశిక్షణకు ఇది నిదర్శనమని తెలిపారు.

## నరసన్నపేట ఎస్‌ఐగా గణేష్ బాధ్యతల స్వీకరణ



**నరసన్నపేట, జనవరి 28(వార్త):** నరసన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బి.గణేష్ బుధవారం అధికారి కంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. నరసన్నపేటలో ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, సజావుగా రవాణా సాగేందుకు చర్యలు చేపడతామని ఎస్‌ఐ గణేష్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, గంజా వినియోగం మరియు అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నిషేధిత పేకాటతో పాటు ఇతర చట్ట విరుద్ధ ఆటలపై కూడా దాడులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకురావాలని కోరిన ఆయన, పోలీస్-ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పడమే తన లక్ష్యమన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## శిథిలావస్థకు చేరిన తిలారు రైల్వే క్వార్టర్లు

**జలుమూరు, జనవరి 28(వార్త):** తిలారు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే క్వార్టర్లు దశాబ్దాల కాలం నాటివి కావడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు దట్టంగా పెరిగిపోయి, రైల్వే సిబ్బంది అక్కడ నివసించేందుకు అనర్హంగా మారాయి. క్వార్టర్ల పరిసరాల్లో అశుభ్రత నెలకొనడంతో పాటు భద్రతా సమస్యలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తిలారు రైల్వే స్టేషన్?ను ఆధునికీకరణ దిశగా అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ, రైల్వే క్వార్టర్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను మాత్రం విస్మరించారని వారు విమర్శిస్తున్నారు. సిబ్బందికి నివాస సౌకర్యాలు కల్పించడమే కాకుండా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా తిలారు రైల్వే క్వార్టర్లను వెంటనే మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..మరొకరికి గాయాలు



**జి.సిగడాం, జనవరి 28(వార్త):** సీతంపేట కూడలి వద్ద బుధవారం రోడ్డు ప్రమాదంలో నిద్దాం గ్రామానికి చెందిన చౌదరి సూరపునాయుడు ఉరఫ్ తాత(45) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన పోదిలాపు అదినారాయణ కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. సూరపునాయుడు, ఆదినారాయణ దిచక్ర వాహనంపై రాజాం నుంచి స్వగ్రామం నిద్దాం వెళుతుండగా వ్యాన్ డీ కోన్న సంఘటనలో సూరప నాయుడు మృతి చెందగా మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన అదినారాయణను చికిత్స నిమిత్తం రాజాం అసుపత్రికి తరలించారు. మృతునికి భార్య గౌరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం కాక మరో ఇద్దరు కుమార్తెలకు వివాహం కావాల్సి ఉంది. సూరుపు నాయుడు మృతి చెందడంతో భార్య, కుటుంబ సభ్యులు గ్రామస్తులు బోరున విలపించారు. గ్రామంలో యాత్ర జరుగుతున్న సమయంలో ఈ ఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# దేశ రక్షణలో తరించి.. గ్రూప్-2 వరించి!

**-సరస్వతీ పుత్రుడు.. ధర్మారావు**

**-నేవీలో పని చేస్తూ ఉద్యోగ విరమణ**

**-ప్రభుత్వ ఉపాధ్యాయునిగా నియామకం**

**-ప్రస్తుతం గ్రూపు-2 ఉద్యోగానికి ఎంపిక**

**మందస, జనవరి 28(వార్త):** కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని ఓ కవి అన్నాడు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమి ఉండదని పెద్దలు చెబుతారు. ఈ పెద్దల మాటలతో విజయతీరాలను అందుకున్నాడు ఈ యువకుడు.. కృషి, పట్టుదల, అంకితభావాలతో అహర్నిశలు శ్రమించి, విజయ బావుటా ఎగురవేశాడు. నేవీ ఉద్యోగం చేసి, రిటైర్మెంట్ తీసుకున్నాక.. ఆయన విశ్రమించలేదు.. సమాజాన్ని మార్చే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నాడు.. అక్కడితో ఆగిపోకుండా సరస్వతీ కటాక్షాన్ని సాధించి, గ్రూప్-2 ఉద్యోగం సాధించాడు. ఓ మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన నేడు అందరికీ దారి యువతకు ఆదర్శంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని పితాతోళి/భైరిసారంగపురం గ్రామానికి చెందిన తమ్మినేని ధర్మారావు సామాన్య, పేద కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు తమ్మినేని త్రినాథరావు, తల్లి అనసూయ. భైరిసారంగపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్న ధర్మారావు, మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నారు. 2009లో నేవీ ఉద్యోగానికి ఎంపికైన ధర్మారావు 15ఏళ్ల పాటు ఎంతో బాధ్యతాయుతంగా దేశానికి సేవలందించారు. నేవీ ఉద్యోగం నుంచి 2024వ సంవత్సరంలో రిటైర్మెంట్ పొందారు. ఉద్యోగ విరమణ చేశాక ఆయన పట్టువదల్లేదు. 2006-2008వ సంవత్సరంలో కృష్ణా జిల్లాల్లో డైట్ చేసిన ధర్మారావు 2025 మెగా డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. 2025 అక్టోబర్ లో ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తంలో ఉపాధ్యాయునిగా బాధ్యతలు చేపట్టారు. ఉపాధ్యాయునిగా పని చేస్తూ.. 2024 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, 2025 ఫిబ్రవరి మెయిన్స్, 2025 ఏప్రిల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, జూలైలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ లో ఉత్తీర్ణత పొందారు. 2026వ సంవత్సరం జనవరిలో ప్రకటించబడిన గ్రూప్-2 ఫలితాలలో అసిస్టెంట్ సెక్షన్ అధికారి(ఏఎస్ఓ) అధికారిగా ఎంపికయ్యారు. విజయవాడలో ఆయన విధులు నిర్వహించవచ్చని సమాచారం. ఓ పేద, సామాన్య కుటుంబానికి చెందిన ధర్మారావు లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, 37 ఏళ్ల వయస్సు మీద పడుతున్నప్పటికీ.. ఒక ఉద్యోగంలో ఉద్యోగ విరమణ చేసి, మరో



ఉద్యోగంలో పని చేస్తూ.. అధికారిగా చూడాలనుకున్న తల్లిదండ్రులు త్రినాథరావు, అనసూయ కలలు, నెరవేర్చిన ధర్మారావును పలువురు అభినందిస్తున్నారు. విజయమే లక్ష్యం చేసుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ధర్మారావుకు పితాతోళి సర్పంచ్ ప్రతినిధి చింతాడ గణపతితో పాటు గ్రామస్తులు అభినందించారు. 25ఏళ్లకే నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న యువతకు ధర్మారావు విజయం ఆదర్శంగా అవుతుందని పలువురు భావిస్తున్నారు.

## కవిటిలో మెగా మెడికల్ క్యాంప్



**ఇచ్ఛాపురం, జనవరి 28 (వార్త):** జేసీఐ ఇచాపురం, ఉష్కోదయ యువజన సంఘం కవిటి సహకారంతో ఏఆర్ఎస్ గ్యాస్ట్రో లివర్ కేర్ సౌజన్యంతో అగ్నికుల క్షత్రియ సేవా సంఘ భవనం, కవిటిలో లివర్ , గ్యాస్ట్రిక్ ఆరోగ్యంపై దృష్టి సారించి మెగా మెడికల్ క్యాంప్ ను నిర్వహించారు. సుమారు 160 మంది ప్రజలు వివిధ వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్. టి.వి. ప్రదీప్ సేవలు అందించారు. ఈ శిబిరంలో ఫైబ్రోస్కాన్ పరీక్షలు, బాడీ ఫ్యాట్ అనాలిసిస్, స్క్రీనింగ్ పరీక్షలు ఉచిత వైద్య సేవలు అందించారు. జేసీఐ ఇచాపురం అధ్యక్షుడు జేసీ బోయినా శ్రావణ్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సభ్యులు తంగుడు షణ్ముఖ్, జైదేవ్, కార్యదర్శి సంతోష్, మోహన్ వెంకటేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీపీ



**ఇచ్ఛాపురం, జనవరి 28(వార్త):** కే.శాసనం అంగన్వాడీ సెంటర్ లో ఎంపిపి బోర పుష్ప పరిశీలించారు.బాలింతలకు పాలు పేకెట్స్ పంపిణీ చేశారు. బాలింతలు కు గర్భవతి లకు చిన్నారులు కు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు.

## రత్తకన్నలో సామూహిక కుంకుమ పూజ



**ఇచ్ఛాపురం, జనవరి 28(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి రత్త కన్న నాయుడు వీధి ఒరియా వీధి జంక్షన్లో, సరస్వతి దేవి నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సరస్వతి దేవి కి పూజలు నిర్వహించారు.

## కళాకారుల సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

**పాతపట్నం, జనవరి 28(వార్త):** పాతపట్నంలో రంగస్థల కళాకారులందరూ ఏకమై తమ సంక్షేమం కోసం స్వర్గీయ డి.వి సుబ్బారావు పేరున కళాకారుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు సంఘం నిర్వాహకులు మెట్ట ఆంజనేయులు నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రకటించారు సంఘ గౌరవ అధ్యక్షులుగా డి.వి సుబ్బారావు, కిలారి లక్ష్మి, సిహెచ్ మోహిని వ్యవహరించారు అధ్యక్షులుగా అటకట్ల హరిబాబు, ఉపాధ్యక్షులుగా ఆర్ కృష్ణస్వామి,ప్రధాన కార్యదర్శిగా పెద్దింటి మోహన్‌దాస్, సహాయ కార్యదర్శిగా బాడాన షణ్ముఖ రావు, కోశాధికారిగా దుర్గాప్రసాద్ మహాపాత్రో, ప్రధాన సలహాదారుగా కోన వెంకటరమణ,సహాయ సలహాదారులుగా కాత హరిబాబు, వండాన మహేష్,కిమ్మి సంతోష్, కార్యనిర్వాక అధ్యక్షులుగా కణితి సూర్యనారాయణ, బొడ్డేపల్లి శ్యామలరావు,పెద్దింటి జీవనరావు, ఇతర కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు,స్థానిక కళాకారులు పాల్గొన్నారు.




## సమాజ చైతన్యం కోసమే 'కన్నీటి బ్రతుకు'



**మందస, జనవరి 28(వార్త):** అంతరించిపోతున్న కళలను జీవింపజేయడానికి ఎంతో ప్రయత్నాలు చేస్తున్నామని ప్రముఖ జానపద, సినీ కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్ అన్నారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీష్మ ఏకాదశి సందర్భంగా బొగాబందలో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. కళాకారులు, కళాభిమానులు నాటకాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఎంజీఆర్‌కు తెలుగు యువత అధ్యక్షుల కృతజ్ఞతలు

**ఎల్ఎన్ పేట/ పాతపట్నం, జనవరి 28 (వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నాయకత్వానికి ఎల్ఎన్ పేట మండల తెలుగు యువత అధ్యక్షులు అంపిలి పోలినాయుడు ఐదు మండలాల తెలుగు యువత అధ్యక్షులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ పాతపట్నం నియోజకవర్గంలో సమర్థవంతమైన నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న నిర్ణయాలకు గాను ఆయన ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో ఈ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల తెలుగు యువత అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్‌కే ప్రతినిధిపై పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు



**పలాస, జనవరి 28 (వార్త):** బీఆర్‌కే ప్రతినిధిపై టిడిపి నాయకులు కాశీబుగ్గ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. టెక్కలి నియోజకవర్గం, నందిగం మండలం, పెద్ద లవునిపల్లి గ్రామానికి చెందినా బొడ్డ శ్రావణ్ (శ్రావణ్ కుమార్) గత కొన్నేల్లుగా వివిధ టీవీ ఛానెల్లో రిపోర్టర్ గా పనిచేస్తూ ఎంతోమందిని బెదిరిస్తూ అనేక వివాదాస్పద రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కుడా జోక్యం చేసుకొని రిపోర్టర్ ముసుగులో సేటల్మేంట్ లు చేస్తూ అడ్డుగోలు అవనీతి సంపాదనకు అలవాటుపడి అనేక ఆర్దిక వసుల్లుకు పాల్పడిన ఇతను ఇటీవలి కాలంలో హైదరాబాద్ కు చెందినా బిఆర్ కె న్యూస్ ఛానల్లో రిపోర్టర్ గా చేరి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాస ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి బయలుదేరుతున్న సమయంలో సదరు రిపోర్టర్ బొడ్డ శ్రావణ్ (శ్రావణ్ కుమార్) మీ ఇంటర్వ్యూ కావాలని శాసనసభ్యురలిని కోరడంతో అందుకు ఆమె సమాధానం ఇస్తూ ప్రస్తుతం ప్రభుత్వం కార్యక్రమాలకు వెళ్తున్నందున తరువాత మీతో మాట్లాడుతానని తెలియజేయడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరోజునుంచి ఆమెను ఆమె కుటుంభ సభ్యులపై నిరాధార అవనీతి ఆరోపణలతో తన అభిమాన కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా అసత్య ప్రచారాలను తను పనిచేసే బి ఆర్ కే న్యూస్ ఛానల్ ద్వార పచ్చి అబద్దాలను క్రోడీకరించి ప్రచురించడం జరిగిందని తెలిపారు . అభివృద్ధి అజండగా అవనీతి రహిత సమాజం కోసం అనునిత్యం పరితపిస్తూ గత 18 నెలల కాలంలో సుమారు 1600 కోట్ల రూపాయులు విలువ గలిగిన అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెట్టిస్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తన తాత తండ్రుల ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడానికి పనిచేస్తూన్న గౌతు శిరీషకి ప్రజల్లో మంచి పేరుప్రఖ్యాతలు రావడం చూసి ఓర్వలేని కొందరు కుహన రాజకీయ నాయకుల చెప్పు చేతుల్లో సదరు రిపోర్టర్ శ్రావణ్ కుమార్ ఈ కధను అల్లి దుష్ప్రచారానికి వడిగట్టాడని కాశీబుగ్గ ఎస్సై ఆర్ నరసింహమూర్తికి ఫిర్యాదులో పేర్కొన్నారు. గౌరవ మర్యాదలు కలిగి ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ పరిపాలస్తున్న గౌతు శిరీష పరువు ప్రతిష్టలతో పాటు వ్యక్తిగత జీవితానికి, ప్రజా జీవితానికి భంగం కలిగించే విధంగా వారిని వారి కుటుంభ సభ్యులపై నిరాధార అవనీతి ఆరోపణలతో కూడిన అసత్య కథనాన్ని ప్రచారం చేస్తున్న సదరు రిపోర్టర్ బొడ్డ శ్రావణ్(శ్రావణ్ కుమార్) అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో టిడిపి నాయకులు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, గాలి కృష్ణారావు, మల్ల శ్రీనివాసరావు, బడ్డ నాగరాజు, ఎం నరేంద్ర, సవర రాంబాబు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలాస జిల్లా కేంద్రంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

**పలాస, జనవరి 28(వార్త):** పలాస జిల్లా కేంద్రం ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఐసిసి ఓబీసీ విభాగపు జాతీయ కోఆర్డినేటర్, ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డా. దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పలాస జిల్లాకు అనుకూలంగా ఉన్నారనే వార్తలు విన్నామని, ఏది ఏమైనా పలాస జిల్లాకు అవసరమైన కారణాలు ఎన్నైనా చెప్పొచ్చని అన్నారు. విభజిత ఏపీ రాష్ట్రానికి 13 జిల్లాలు ఉన్నపుడు కేంద్రం నుండి వచ్చే నిధుల్లో 13వ వాటా వచ్చేదని, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 26 జిల్లాలు అయినపుడు శ్రీకాకుళం జిల్లాకు గతంలో వచ్చే వాటా 1/13 నుండి 1/26 కి తగ్గిపోయిందని తెలిపారు. ఇటీవల మరో రెండు జిల్లాలను కలిపి 28 జిల్లాలు ఏర్పాటు చేయడం వలన శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ నిధులు మరింత తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వున్న 13 జిల్లాల్లో 12 జిల్లాలను విభజించి ఒక్క శ్రీకాకుళం జిల్లానే యదాతదంగా కొనసాగించి ఆ వచ్చే కేంద్ర నిధులను ఇంకా తగ్గించివేశారని తెలిపారు. అన్ని జిల్లాలు పునర్విభజించి ఒక్క శ్రీకాకుళం జిల్లా పట్ల చూపిన వివక్షతల్లో ఇదొక మచ్చుతునక అని అన్నారు. శ్రీకాకుళం జిల్లా కొంతమంది అనుకున్నట్టు వెనుకబడిన జిల్లాకాదని ఇది వెనుకకు నెట్టేసిన జిల్లాగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలందరూ పలాస జిల్లా కోసం అడుగులో అడుగేసి ప్రభుత్వాన్ని అడుగుదాం. పలాస జిల్లాను సాధిద్దాం.. అని పిలుపునిచ్చారు.



## గ్రూప్-2 లో సత్తాచాటిన జైలు వార్డెన్



**ఇచ్ఛాపురం, జనవరి 28(వార్త):** బూర్జపాడు గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన బుడత దివాకర్ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్(ఏపీపీఎస్సీ (గ్రూప్-2)లో బీసీ-ఏ గేటగిరిలో 211 మార్కులతో సత్తాచాటి మొదటి ప్రయత్నంలోనే జూనియర్ అసిస్టెంట్ గా ఎంపికయ్యా రు. నిరుపేద కుటుంబానికి చెందిన దివాకర్ ప్రైమర్, హైస్కూల్ బూర్జపాడు ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ కవిటి ప్రభుత్వ కళాశాలలో చదువు పూర్తి చేసుకున్నారు. 2014లో జైల్ వార్డెన్ గా ఎంపికై రాజమండ్రి జైల్లో ఉద్యోగంలో చేరారు. తరువాత ప్రవేట్ గా (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) డిగ్రీని 2016లో పూర్తి చేశారు. 12 ఏళ్లు గడిచిన ఇంకా గ్రూప్స్ ఉద్యోగం సాదించాలనే పట్టుదలతో అప్పటి నుండే బుక్స్ కొనుగోలు చేసుకొని గ్రూప్స్కు ప్రిపేరయ్యారు. చివరి నాలుగు నెలలు విదులకు సెలవు పెట్టి ఇంటివద్దనే ప్రిపేర్ అయ్యారు. ఎట వంటి శిక్షణ లేకుండా ఇంటివద్ద పట్టుదలతో చదువుకొని గ్రూప్-2లో మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాదించటం ఆనందంగా ఉందని కాని గ్రూప్-1లో ఉద్యోగం సాదించాలన్నదే లక్ష్యమని ప్రస్తుతం విశాఖపట్నం జైల్లో వార్డెన్ గా విదులు నిర్వహిస్తున్నానని దివాకర్ తెలిపారు. ఉమాపతి చిన్నప్పుడు(టెన్త్ చదువుతున్నపుడే) తండ్రి మృతి చెందారు. తల్లి లోలాక్షి కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించిందని తెలి పారు. దివాకర్ భార్య ప్రభ గృహిణి వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. తమ్ముడు డిల్లీరావు ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు.

## కళింగ సమాజానికి సంక్షేమ పథకాల అమలు చేయాలి

**నరసన్నపేట, జనవరి 28(వార్త):** గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవనంలో బుధవారం బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు పాల్గొని, కళింగ సమాజానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సవిత ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్పొరేషన్ చైర్మన్లకు సంబంధించిన ప్రోటోకాల్ అమలు, వారి సమస్యలు, బీసీల ఆర్థిక అభివృద్ధికి అవసరమైన పనిముట్లు, యూనిట్ కాస్ట్ వంటి అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్, ఇతర శాఖాధికారులు, వివిధ బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఏఎస్‌వోగా రాము

**శ్రీకాకుళం, జనవరి 28(వార్త):** గార మండలం అంపోలు గ్రామానికి చెందిన కొరుపోలు రాము ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - గ్రూప్2 ఫలితాలలో ఏఎస్‌వో (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)గా ఎంపికయ్యారు. ఆయనకు ఆ గ్రామ స్థులు, రవి ట్యుటోరియల్ సంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



## డీటీగా ఎంపికైన వీరమల్లిపేట వాసి

**సరుబుజ్జిలి, జనవరి 28(వార్త):** ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల్లో సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేట గ్రామానికి చెందిన గుర్ర జయప్రకాష్ ప్రతిభ చూపాడు. జోన్ 1 ఓపెన్ కేటగిరీలో డిప్యూటీ తహసీల్దార్ గా తాను ఎంపికైనట్లు తెలిపారు. ప్రాథమిక విద్య వీరమల్లిపేటలోనూ, మాధ్యమిక విద్య జెడ్పీ హైస్కూల్ లోనూ, తొమ్మిది, పది వేంకటసాయి పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్.ఈ.సీ. గ్రూప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల శ్రీకాకుళంలో బీఏ చదివిన అనంతరం ఆంధ్ర విశ్వ విద్యాలయం లో ఎంఏ చదివిన జయప్రకాష్ గతంలో గ్రూప్ 1... ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. ప్రస్తుతం వైజాగ్ కోచింగ్ సెంటర్లో ఫ్యాకల్టీ మెంబర్‌గా పనిచేస్తూ... గ్రూప్ 2 పరీక్షలు రాసి విజయం సాధించారు. తల్లిదండ్రులు రామరాజు, రాజరాజేశ్వరిది వ్యవసాయ కుటుంబ నేపథ్యమే. రెండవ కుమారుడు రఘుశ్రావణ్ హెరిటేజ్ ఫుడ్స్‌లో హెచ్‌ఆర్ మేనేజర్ గా పనిచేస్తున్నాడు.



## చీడపీడల నివారణపై అప్రమత్తం



**జలుమూరు, జనవరి 28(వార్త):** వ్యవసాయంలో చీడపీడల నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి కింజరాపు రవికుమార్ సూచించారు. బుధవారం జలుమూరు మండలం జోనంకి సచివాలయ పరిధిలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల మంచు అధికంగా కురవడంతో పెసర, మినుము వంటి పంటలకు తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వివరించారు. ప్రారంభ దశలోనే సస్యరక్షణ చర్యలు చేపడితే పంట నష్టాన్ని నివారించి అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. రైతులు పొలాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, అవసరమైన సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం ద్వారా పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మంచి ఫలసాయం పొందవచ్చని ఆయన తెలిపారు.

## ద్రవ జీవామృతాలతో నేల సారవంతం



**నరసన్నపేట, జనవరి 28 (వార్త):** పంట సాగులో ద్రవ జీవామృతాలను వినియోగించడం ద్వారా పంటల దిగుబడి మెరుగుపడటంతో పాటు భూమి సారవంతత పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ తెలిపారు. బుధవారం నరసన్నపేట మండలం మాకివలస బయో రీసెర్చ్ సెంటర్?లో రైతులు, ఐసీఆర్పిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవామృతం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయ ద్రవాలను తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతుల్లో సాగు చేస్తే పంటలు ఆరోగ్యంగా పెరిగి ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు సద్వినియోగం చేసుకొని దీర్ఘకాలికంగా మేలైన ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. సదస్సులో పాల్గొన్న రైతులు, ఐసీఆర్పిలు ఈ అవగాహన కార్యక్రమం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు.

## మోడల్ స్కూల్ సిబ్బందికి సత్కారం



**జలుమూరు, జనవరి 28(వార్త):** జలుమూరులోని మోడల్ ప్రైమరీ పాఠశాల స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి అవార్డు పొందిన సందర్భంగా, ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎన్విఆర్ఎస్ ప్రసాద్ రావు పాఠశాల సిబ్బందిని అభినందించారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఎంఈఓలు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి కృషిని ప్రశంసించారు. పాఠశాల పరిశుభ్రత, నిర్వహణ విధానం ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. ఇదే విధమైన క్రమశిక్షణ కొనసాగిస్తే జాతీయస్థాయిలో కూడా ఉత్తమ పాఠశాలగా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఎంఈఓలకు కృతజ్ఞతలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## పైపులైన్ లీకేజీపై లక్ష్మీపురం వాసుల ఆవేదన



**సారవకోట, జనవరి 28 (వార్త):** లక్ష్మీపురం గ్రామ సమీపంలో తాగునీటి ప్రధాన పైపులైన్ లీకై భారీగా నీరు వృథా అవుతోంది. జలుమూరు మండలం బొడ్డపాడు నుంచి లక్ష్మీపురం వైపు వెళ్లే తాగునీటి పైపులైన్ కాలువకు సమీపంలో పగిలిపోవడంతో, సరఫరా అయ్యే నీరంతా కాలువలోకి చేరుతోంది. గ్రామంలో ఇప్పటికే తాగునీటి ఎద్దడి పరిస్థితులు నెలకొని ఉండగా, ఈ విధంగా విలువైన తాగునీరు వృథాగా పోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీని సకాలంలో గుర్తించి మరమ్మతులు చేయకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ లీకేజీని సరిచేసి, తాగునీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా : శ్రీకాంత్



**పలాస, జనవరి 28(వార్త):** పలాస మున్సిపాలిటీలో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని 17వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 17 వ వార్డు లో శరవేగంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆ వార్డు కౌన్సిల్ సభ్యులు దువ్వాడ శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. సాయి కాలనీ తిలక్ నగర్ వీధులను కలుపుతూ వేస్తున్న సి సి రోడ్డు, డ్రనేజ్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటుచేసి అందించాలని సూచించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. పనులు పూర్తి ఆయన వెంటనే ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులు మీదగా ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ పెద్దలు పి కాళీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తెంబూరులో పొలం పిలుస్తుంది

**పాతపట్నం, జనవరి 28(వార్త):** తెంబూరు గ్రామంలో సాగు చేస్తున్న వరి పొలాలనం రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి కొర్ను సింహాచలం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం సందర్శించారు ఈ సందర్భంగా రైతులకు వరి పంటలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై సూచనలు సలహాలు అందించారు ప్రతి రెండు మీటర్ల దూరానికి 20 సెంటీమీటర్లు చొప్పున కాలిబాటలు తీసుకోవడం వలన మొదటి దశ నుంచి కోత కోసే వరకు కూడా చేయవలసిన అన్ని సస్యరక్షణ చర్యలకు సులువుగా ఉంటుందని అదేవిధంగా యురియా డీఏపీ తోపాటుగా పొటాష్ కూడా ఎకరాకు 15 కేజీలు అందించడం వలన పంటను ప్రతికూల పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చని సూచించారు రైతులు ఆరుతడి పంటల సాగుపై శ్రద్ధ చూపాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు ఎన్ని ఇంద్రసేనారావు,అమ్మోజి, చంద్రరావు మరియు తెంబూరు గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు చెట్లతాండ్రలో అరటి గెలల పండగ



**సంతబొమ్మాళి, జనవరి 28(వార్త):** భీష్మ ఏకాదశి అంటే చెట్లతాండ్ర అరటి గెలల పండగ అందరికి గుర్తొస్తోంది. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని గురువారం నుండి సంతబొమ్మాళి మండలంలోని చెట్లతాండ్రలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించనున్నారు. చెట్లతాండ్రలో అరటి గెల సంబరంలో భాగంగా అరటి గెలలు కట్టడానికి పక్క రాష్ట్రాలు ఒరిస్సా, తెలంగాణ, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. మొదటి రోజున స్వామి వారి పతాకావిష్కరణ అనంతరం నగర సంకీర్తన, అన్న దానం, భజన బృందంతో భక్తి సంగీత విభావరి, సినీ ఫోక్ నృత్యాలు ప్రదర్శిస్తారు. రెండవ రోజు ఉదయం స్వామి వారికి కుదుమ పూజ , అభిషేకాలు , హోమం, భజన, పాటలు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటుంది. అనంతరం భక్తులు కట్టిన అరటి గెలలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, పరవస్తు అయ్యవారు, యువత తెలియజేశారు.

# ఉపాధి నిధులకు.. పంగ నామాలు

* ఏపీవో నరసింహమూర్తి అక్రమాలు బట్టబయలు
* ఉపాధి నిధులు స్వాహా చేసిన అక్రమార్కుడు
* రూ.3,07,379 ఫీల్డ్ అసిస్టెంట్ భార్య ఖాతాలో జమ
* ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న అక్రమాలు
* నిలదీస్తున్న వేతనదారులు
* మౌనం వహిస్తున్న సంబంధిత అధికారులు
* వారిపై కూడా వెల్లువెత్తుతున్న అనుమానాలు






**సంతబొమ్మాళి, జనవరి 28 (వార్త):** తీగ లాగితే డొంక కదిలినట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో పంగ నరసింహమూర్తి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతోంది. ఎన్టీఆర్ స్వగృహ, హార్టికల్చర్, ఎన్యు ప్లాంటేషన్, మినీ గోకులం పెండింగ్ బిల్లులు లబ్ధిదారులకు చెల్లించకుండా తనకు నమ్మకమైన వాళ్ల అకౌంట్‌కు నిధులను జమ చేసి స్వాహా చేసిన సంఘటనలు ఒక్కొక్కటి గా వెలుగులోకి వస్తోంది. సంతబొమ్మాళి మండలంలో కాపు గోదాయవలస ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనంజయ భార్య మాణిక్యం అకౌంట్‌కు అధిక మొత్తంలో లబ్ధిదారుల బిల్లులను గత ఏడాది ఆగస్టు నెలలో ఏపీవో పంగ నరసింహమూర్తి జమ చేయించారు. సుమారు ఐదు నెలలు తర్వాత ఈ బండారం బయటపడింది. 'జాతీయ వార్త'లో కథనాలు వెలువడడంతో ఏపీవో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వివిధ పంచాయతీలకు చెందిన లబ్ధిదారుల బిల్లులను ఏపీఓ తనకు నమ్మకమైన ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాలకు మళ్లించడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాపు గోదాయవలస ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ భార్య మాణిక్యం అకౌంట్‌కు 3 లక్షల 7 వేల 379 రూపాయలు జమ అయింది. ఇందులో 17 పంచాయతీలకు సంబంధించి చెట్లతాండ్ర, గోవిందపురం, ఆరికవలస, బోరుభద్ర, చిన్న తుంగాం, దండుగోపాలపురం, కొల్లిపాడు, కోటపాడు, నౌపడ, లక్కివలస, పాలతలగాం, సంతబొమ్మాళి, ఆర్‌హెచ్‌పురం, నర్సాపురం, మేఘవరం, ఆకాశలక్కవరం, లింగూడు పంచాయతీలకు చెందిన 87 మంది లబ్ధిదారుల ఎన్టీఆర్ స్వగృహ పెండింగ్ బిల్లులు ఒక లక్ష 99 వేల 232 రూపాయలు అంగ మాణిక్యం అకౌంట్‌కు జమ చేశారు. అంతటితో ఆగకుండా హార్టికల్చర్‌కు సంబంధించి ఏడు పంచాయితీలు ఆర్‌హెచ్‌పురం, లింగూడు, కొల్లిపాడు, చెట్లతాండ్ర , ఆరికవలస, కాపు గోదాయవలస, దండు గోపాలపురం పంచాయతీలకు చెందిన 52 మంది లబ్ధిదారుల బిల్లులు 57 వేల 014 రూపాయలు, అలాగే ఏన్యుప్లాంటేషన్ సంబంధించి ఏడు పంచాయతీలు ఆరికవలస, దండుగోపాలపురం, కాపు గోదాయవలస, కొల్లిపాడు, కోటపాడు, లింగూడు, ఆర్ హెచ్ పురం పంచాయతీలకు చెందిన 54 మంది లబ్ధిదారుల బిల్లులు 51వేల 494 రూపాయలు మొత్తం 3 లక్షల 7 వేల 379 రూపాయలు గత ఏడాది ఆగస్టు నెలలో కాపు గోదాయవలస ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ భార్య మాణిక్యం అకౌంట్‌కు జమయ్యాయి. ఇంతవరకు ఏ లబ్ధిదారునికి బిల్లులు చెల్లించకుండా అవినీతికి పాల్పడ్డారని పలువురు అంటున్నారు. వివిధ పంచాయతీలకు చెందిన లక్షల రూపాయలు బిల్లులు ఒకే ఫీల్డ్ అసిస్టెంట్ భార్య ఖాతాకు జమ చేయడంపై అవినీతికి చిరునామాగా మారిందని పలువురు అంటున్నారు. దీనిపై విచారణ చేపట్టి ఏపీఓ పంగ నరసింహమూర్తి పై చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీలకు చెందిన పలువురు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. దీనిపై కాపుగోదాయవలస ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయను వివరణ అడుగగా నా భార్య మాణిక్యం అకౌంట్ కు లక్షల రూపాయలు జమ అయ్యాయని ఒప్పుకున్నారు. ఇదే విషయమై ఏపీవోను వివరణ కోరగా పీడీ ఆదేశాల మేరకే వెండర్ పేరు మీదుగా అకౌంట్‌లో నగదు జమ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ విధంగా చేశామని, జిల్లావ్యాప్తంగా ఇదే విధంగా జరుగుతోందని నరసింహమూర్తి తెలిపారు.

## శ్రీకూర్మ క్షేత్రానికి మహర్దశ

* రూ.10 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళిక * తొలి విడతగా రూ.3 కోట్లు విడుదల చేసిన ఇండిగో సంస్థ * ఆర్కిటెక్ట్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకూర్మం (గార), జనవరి 28 (వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కూర్మనాథ స్వామి ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో, ప్రముఖ విమానయాన సంస్థ 'ఇండిగో' తన సామాజిక బాధ్యత నిధులతో ఈ క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చింది. బుధవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఇండిగో సంస్థ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్‌లతో కలిసి ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కోసం మొత్తం రూ.10 కోట్ల వ్యయంతో సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.3 కోట్లను ఇండిగో సంస్థ విడుదల చేసిందని, దశలవారీగా మిగిలిన నిధులు అందుతాయని ఆయన పేర్కొన్నారు. శ్వేత పుష్కరిణి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భక్తుల వసతులే లక్ష్యంగా ఈ పనులు సాగనున్నాయి. వచ్చే 30 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. శ్వేత పుష్కరిణి గట్టుపై ఉన్న ఆక్రమణలను తొలగించి, అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా అభివృద్ధి చేస్తారు. ఆలయ వైభవం ప్రతిబింబించేలా ప్రధాన ముఖద్వారాన్ని నిర్మించనున్నారు. పనుల నాణ్యత, డిజైన్లపై జలవనరుల శాఖ ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్, స్థానిక సచివాలయ సిబ్బంది, జలవనరుల శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెస్ట్ విజేతలకు బహుమతులు

శ్రీకాకుళం,జనవరి28(వార్త): సైన్స్ ఫెస్ట్‌లో గెలుపొందిన గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం బహుమతులు అందజేశారు. సీతంపేట ఐటిడిఎలో వివిధ సబ్జెక్టులపై మాక్ పార్లమెంట్, సైన్స్ ఫెస్ట్ అన్వేషణ నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ తో పాటు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శ్రీ పవర్ స్వప్నిల్ జగన్నాథంలు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నాదొరై, ఉప విద్యాశాఖాధికారి పి. నారాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## కార్గిల్ విక్టరీ పార్క్ పనులు వేగవంతం చేయాలి

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం,జనవరి28(వార్త):** కార్గిల్ విక్టరీ పార్క్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కార్గిల్ విక్టరీ పార్క్‌లో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రవేశ ద్వారం బాగా తయారు చేయాలన్నారు. పార్క్ ను ప్రతీ ఒక్కరూ వినియోగించుకునే విధంగా ఉండాలనే ఉద్దేశంతో పార్క్‌లో నిర్మితమవుతున్న రెండు బ్యాట్మింటన్ కోర్టులు, పికెల్ బాల్ కోర్ట్, బాక్స్ క్రికెట్ కోర్టు, క్రీడలకు పూర్తి స్థాయిలో వినియోగం అవ్వాలన్నారు. యోగా ప్లాట్ ఫారం (ఓపెన్ ఎయిర్ థియేటర్) ను యోగాకు లేదా స్క్రీన్ పెట్టి సినిమా చూసుకునే తయారు చేయాలన్నారు. గతంలో శిధిలావస్థలో ఉన్న లైబ్రరీని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆ భవనానికి పక్కనే మెడిటేషన్ చేసుకొనే విధంగా తీర్చిదిద్దాలన్నారు. టాయిలెట్ కంటైనర్ మోడల్‌లో వస్తుందని సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ కలెక్టర్‌కు వివరించారు. కాఫీ షాపు కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు వెనుక భాగంలో కార్గిల్ చరిత్ర ఏర్పాటుకు సైనిక సంక్షేమ అసోషియేషన్ నుండి ఒక కమిటీ ఏర్పాటు చేసి కార్గిల్‌కు సంబంధించి ఒక చరిత్రను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శైలజ ను ఆదేశించారు. సందర్శకులు ఎవరైనా పార్క్ కు వస్తే కార్గిల్ యుద్ధం ఎప్పుడు ఎప్పుడు ప్రారంభం అయింది.. ఎప్పుడు అంతం అయిందనే విషయాలను, తదితరమైన సమాచారం ఉండాలన్నారు. పార్క్‌లో జరుగుతున్న ప్రతీ ఒక్క పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వాటర్ ట్యాంక్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో చూపించాలని డిఈని ఆదేశించారు. ఇప్పుడు చేసే పనులు శాశ్వతంగా దండాలని, ఎవరు వచ్చిన సునాయాసంగా పనులు చేసుకొనే విధంగా ఉండాలన్నారు. పార్క్ పనులు సత్వరమే పూర్తి చేసి అందించాలని చెప్పారు. ఈ పర్యటనలో సైనిక సంక్షేమ అధికారి శైలజ, సెవెన్ హిల్స్ అసోషియేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి తాగునీరుకి సంబంధించి డిఈ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.





## ఎర్ర చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

**పాతపట్నం, జనవరి 28 (వార్త):** పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు నియోజకవర్గ కేంద్ర పరిధిలో గల ఎర్ర చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని, పనులు నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. ఎర్ర చెరువు అభివృద్ధి ద్వారా మేజర్ పంచాయతీ ప్రజలకు పార్కు వాకింగ్ ట్రాక్, పరిసర పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మండల పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎల్ఎస్ఏ ఉద్యోగాలకు 30 వరకు గడువు పొడిగింపు

**శ్రీకాకుళం, జనవరి 28 (వార్త):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ)లో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునే గడువును అధికారులు పొడిగించారు. వాస్తవానికి ఈ నెల 27తో ముగియాల్సిన గడువును అభ్యర్థుల సౌకర్యార్థం ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయనున్న ఈ పోస్టులకు సంబంధించి మొత్తం నాలుగు ఖాళీలు ఉండగా, పోస్టును బట్టి నెలకు రూ.23,120 నుండి రూ.89,720 వరకు వేతన శ్రేణి వర్తించనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా కోర్టు అధికారిక వెబ్?సైట్ నుండి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, వాటిని భర్తీ చేసి ఈనెల 30వ తేదీలోపు అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను కేవలం రిజిస్టర్డ్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే 'చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శ్రీకాకుళం' చిరునామాకు పంపాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు తెలిపారు. ఇతర మార్గాల ద్వారా వచ్చే దరఖాస్తులు పరిగణించబడవని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## పది బార్ల కేటాయింపునకు నోటిఫికేషన్ విడుదల

### వచ్చే నెల 5న లాటరీ ద్వారా ఎంపిక - దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

**శ్రీకాకుళం, జనవరి 28 (వార్త):** జిల్లాలో నూతన బార్ పాలసీ (2025-28) అమలులో భాగంగా గతేడాది మిగిలిపోయిన 10 బార్ల కేటాయింపునకు అబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి తిరుపతిరావు గెజిట్ నంబర్ 17ను జారీ చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 5, పలాసలో 2, ఇచ్ఛాపురంలో 2, ఆమదాలవలసలో ఒక బార్ కేటాయింపునకు దరఖాస్తులు కోరుతున్నారు. ఈ బార్లకు బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తులు సమర్పించవచ్చు. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. ప్రాంతాల వారీగా రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను అధికారులు ఖరారు చేశారు. శ్రీకాకుళం, పలాస: రూ. 41.25 లక్షలు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం: రూ. 31.25 లక్షలు, నాన్-రిఫండబుల్ రూ.5 లక్షల ఫీజుతో పాటు రూ. 10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సివుంది. మద్యం వ్యాపారులకు ఊరటనిచ్చేలా అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. ఏ-4 మద్యం దుకాణాల మాదిరిగానే బార్లకు మార్జిన్లను వర్తింపజేయడం, లైసెన్స్ ఫీజు చెల్లింపునకు బ్యాంక్ గ్యారెంటీ లేదా ఎఫ్‌డీఆర్ సదుపాయం కల్పించడం విశేషం. దరఖాస్తుదారులు ఆధార్, పాన్ కార్డులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను జత చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి సిహెచ్ తిరుపతి నాయుడు తెలిపారు. ప్రతి బార్‌కు కనీసం నలుగురు దరఖాస్తు చేసుకుంటేనే లాటరీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీముఖలింగం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



**జలుమూరు, జనవరి 28 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన శ్రీముఖలింగేశ్వర ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఆయన సమక్షంలోనే ట్రస్ట్ బోర్డు నూతన సభ్యుల ప్రమాణస్వీకారం చేశారు. వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీముఖలింగం ఆలయం రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా పేరొందిన ప్రాచీన, చారిత్రక దేవాలయమని అన్నారు. శివభక్తులకు పవిత్ర క్షేత్రమైన ఈ ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ బోర్డు సభ్యులు అంకితభావంతో పనిచేయాలన్నారు. నూతన సభ్యులంతా భక్తుల సౌకర్యాలు, ఆలయ సంప్రదాయాల పరిరక్షణ, మౌలిక సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర ప్రజాప్రతినిధులు,ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే రాజమార్గం

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

**శ్రీకాకుళం, జనవరి 28 (వార్త):** కక్షిదారులు తమ సమస్యలను సామరస్యంగా, స్వయంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఒక గొప్ప అవకాశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం'పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఒక మధ్యవర్తి తన నైపుణ్యంతో కక్షిదారుల మధ్య సయోధ్య కుదిర్చి, వారు తమ సమస్యలను తామే పరిష్కరించుకునేలా మార్గదర్శనం చేస్తారని తెలిపారు. ఇది పూర్తిగా స్వచ్ఛందమైన ఆంతరంగికమైన ప్రక్రియ అని చెప్పారు. కోర్టు విచారణల వలె దీనికి కఠినమైన ఆదేశిక నియమాలు ఉండవని, ఇరుపక్షాల అంగీకారంతో షరతులను ఖరారు చేసి, క్లుప్తంగా, స్పష్టంగా ఉండే ఒప్పంద పత్రాన్ని ఇక్కడ తయారు చేస్తారని ఆయన వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారమైతే కక్షిదారులు చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందే వెసులుబాటు ఉంటుందని, ఇది అటు న్యాయవాదుల సమయాన్ని, ఇటు కక్షిదారుల ధనాన్ని ఆదా చేస్తుందని వెల్లడించారు. న్యాయవాదులు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకుని, సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షకులుగా వ్యవహరించిన సీనియర్ అడ్వకేట్ వి.పి. తనకచన్, అడ్వకేట్ పి.జి.సురేష్ మధ్యవర్తిత్వంలోని మెళకువలను వివరించారు. వీరితో పాటు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. శివప్రసాద్, కార్యదర్శి పి. దామోదరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546